జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

08 మంగళవారం, సెప్టెంబర్ 2026 పేజీలు:17



02లో

## నీటి తిప్పలకు చెక్

ఎంపీ లాడ్స్ నిధుల తో గ్రామానికి సరికొత్త వెలుగు
ఎంపీ నిధులతో తీరిన తాగునీటి ఎద్దడి.....
బోర్ బావి వేయించడంతో ప్రజల హర్షం






- అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యేల అరెస్టులు..

రైతుల గోడు పట్టని సర్కార్

07లో

హామీల ప్రభుత్వం.. ఆంక్షల పాలన!

వెయ్యి రోజుల పాలన,బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులు, రైతుల సమస్యలు, హామీల అమలుపై కాంగ్రెస్‌పై శ్రీనివాస్ గౌడ్ ధ్వజం

# నీటి తిప్పలకు చెక్

మొదటిపేజీ తరువాయి



**మహమ్మదాబాద్ సెప్టెంబర్ 7( ప్రజా జ్యోతి )**

మహమ్మదాబాద్ మండల కేంద్రంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా మండల కేంద్రానికి మూడు కొత్త బోర్ బావులు మంజూరు కాగా గురువారం రోజు తొలి బోరుబావి తవ్వకం పనులు చేపట్టారు. సమృద్ధిగా నీరు పడటంతో స్థానికులు కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు వేసవికాలంలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ఎంపీ నిధులతో బోరు బావులు మంజూరు చేయడంపై ప్రజలు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండల కేంద్రానికి మొత్తం మూడు బోర్ బావులు మంజూరు చేసిన కొండ విశ్వేశ్వర్ రెడ్డి కి దగ్గరుండి పర్యవేక్షిస్తున్న వెన్న ఈశ్వరప్ప కి స్థానికులు మరియు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉప సర్పంచ్ తో పాటు మండల గ్రామ బీజేపీ నాయకులు మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## టి.వెంకటయ్య సేవలు చిరస్మరణీయం

### విద్యా సేవలతో వెలుగులు నింపిన వెంకటయ్య

### సామాజిక చైతన్యానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం

### రెండో వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు



**మహమ్మదాబాద్:**

విద్యారంగంతో పాటు సామాజిక చైతన్యం కోసం విశేషంగా కృషి చేసిన కీర్తిశేషులు గాదిర్యాల్ టీ. వెంకటయ్య టీచర్ సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు కొనియాడారు. ఆయన రెండో వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం గాదిర్యాల్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటయ్య టీచర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మహమ్మదాబాద్ మండలం గాదిర్యాల్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు టీ. వెంకటయ్య విద్యాబోధనకే పరిమితం కాకుండా సామాజిక చైతన్యం కోసం నిరంతరం కృషి చేశారని అన్నారు. ముఖ్యంగా దళిత సమాజ అభ్యున్నతికి, విద్యార్థుల ఉన్నతికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. వెంకటయ్య ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, వివిధ సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శాంతిబాయ్, ఉపాధ్యాయుడు బోరు కృష్ణయ్య, జి. చంద్రయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, జి. ఆంజనేయులు, బి. రామకృష్ణ, బచ్చనోళ్ల కృష్ణయ్య, జి. కృష్ణయ్య తదితర నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చిరుత భయంతో వణుకుతున్న గండీడ్ రైతాంగం

### రైతుల ప్రాణాలు.. పశుసంపదకు రక్షణ కల్పించాలి

### అటవీ అధికారులను కలిసి తక్షణ చర్యలకు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప విజ్ఞప్తి

**గండీడ్:**

గత కొద్ది రోజులుగా ఉమ్మడి గండీడ్ మండల పరిధిలో చిరుతపులి సంచరిస్తుండటంతో ప్రజలు, ముఖ్యంగా రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పంట పొలాల్లోకి వెళ్లేందుకు రైతులు జంకుతున్న పరిస్థితి నెలకొంది. చిరుతపులి పెంపుడు జంతువులపై దాడి చేసి వాటిని హతమారుస్తుండటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఇబ్బందులపై స్పందించిన బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప సోమవారం అటవీశాఖ కార్యాలయానికి వెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఉమ్మడి గండీడ్ మండలంలో చిరుత సంచారంతో నెలకొన్న పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చిరుత సంచారాన్ని అరికట్టేందుకు తక్షణమే ప్రత్యేక చర్యలు చేపట్టి రైతులు, గ్రామీణ ప్రజలకు రక్షణ కల్పించాలని ఆయన అధికారులను కోరారు. చిరుత దాడుల్లో పశువులు, పెంపుడు జంతువులను కోల్పోయిన రైతులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. చిరుత సంచరిస్తున్న ప్రాంతాలను గుర్తించి అటవీశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చోట కెమెరాలు ఏర్పాటు చేసి చిరుతను సురక్షితంగా పట్టుకునే చర్యలు చేపట్టాలని డాక్టర్ వెన్న ఈశ్వరప్ప కోరారు. రైతుల్లో భయాందోళనలు తొలగించేలా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రైతుల ప్రాణాలు, పశుసంపదకు రక్షణ కల్పించే విషయంలో అధికారులు తక్షణమే స్పందించాలని, సమస్య పరిష్కారం అయ్యే వరకు అవసరమైన చర్యలు కొనసాగించాలని ఆయన కోరారు. రైతులకు అండగా ఉంటామని డాక్టర్ వెన్న ఈశ్వరప్ప తెలిపారు.



# విద్యాసంస్థలను తరచూ సందర్శిస్తూ పర్యవేక్షించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్






**గద్వాల,సెప్టెంబర్ 7(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జిల్లాలోని గురుకులాలు,వసతి గృహాలు,పాఠశాలలను సంబంధిత ప్రత్యేక అధికారులు తరచూ సందర్శిస్తూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ,విద్యాసంస్థల్లో చిన్నపాటి సమస్య కూడా తలెత్తకుండా విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు.అన్ని ప్రభుత్వ విభాగాలు ప్రైవేట్ ఇంటర్నెట్ సేవలను వినియోగించకుండా టీ-ఫైబర్‌కు మారాలని అధికారులను ఆదేశించారు.సెన్సస్ హ్యాండ్‌బుక్ తయారీకి సంబంధించి అన్ని గ్రామాల పరిధిలో నిర్దేశిత సమాచారాన్ని సేకరించి సమర్పించాలని సూచించారు.వినాయక చవితి నేపథ్యంలో గణేష్ మండపాల వద్ద,నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు,ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్,నర్సింగరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి,రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం

## బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు

**గద్వాల సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

ఆరు గ్యారంటీలు,420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు అన్నారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం గద్వాల జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమానికి పార్టీ నాయకులతో కలిసి హాజరై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతిపత్రం సమర్పించారు.అంతకుముందు కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆరు గ్యారంటీలు,420 హామీలను అమలు చేయాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్,అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన మాటలను విస్మరించిందని విమర్శించారు.ఆరు గ్యారంటీలు,420 హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు,ప్రస్తుతం జరుగుతున్న అమలుకు పొంతన లేదని ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిరంతరం నిలదీస్తామని,హామీలపై ప్రభుత్వం పూర్తి సమాధానం చెప్పే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల,మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్,నాగర్‌దొడ్డి వెంకట్రాములు,పలువురు కౌన్సిలర్లు,పార్టీ నాయకులు,కార్యకర్తలు,యువజన విభాగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# D-38 కాలువకు నీరివ్వకపోతే 400 ఎకరాల పంటలు ఎండిపోతాయి!

### - సాగునీటి కోసం రైతుల ఆవేదన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన పల్లెపాడు సర్పంచ్ రమేష్ రైతు సంఘ అధ్యక్షుడు సత్య రెడ్డి గ్రామస్తులు

**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 07:**

గద్వాల:ఊ-38 కాలువకు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేముల గ్రామం నుండి గార్లపాడు గ్రామం వరకు మాత్రమే నీళ్లు వస్తున్నాయి అక్కడనుండి పల్లెపాడు,చండూరు గ్రామాలకు కాలువ నీలో రాకపోవడంతో సుమారు 400 ఎకరాల పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యను వెంటనే పరిష్కరించి చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు రిజ్వాన్ భాషా షేక్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం పల్లెపాడు గ్రామ రైతులు పెద్దలు వారుమాట్లాడుతూ,రైతుల పరిస్థితి దయనీయంగా మారింది:ఊ-38 కాలువపై ఆధారపడి అనేక మంది రైతులు తమ వ్యవసాయ భూముల్లో పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు.ప్రస్తుతం పంటలకు కీలకమైన సమయంలో కాలువ ద్వారా నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

**"అధికారులు వెంటనే స్పందించాలి:**

కాలువలో ఉన్న సమస్యలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టి,సాగునీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు.400 ఎకరాల పంటలను కాపాడేందుకు అత్యవసర చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.నీళ్లు రాకపోతే రైతులు ఆత్మహత్య చేసుకునే ప్రమాదం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ రమేష్ మౌర్య,గ్రామ రైతువేధిక అధ్యక్షుడు మారం సత్య రెడ్డి,మాజీ సర్పంచ్ కె.వెంకటేష్,కె. సత్యనారాయణ, జాల గురుస్వామి జాల సుధాకర్,వార్డ్ మెంబర్ చాకలి పెద్ద ఈరన్న,టి రాముడు,టి.నాగేంద్ర, వెంకటస్వామి,గొల్ల ధర్మరాజు,కుర్వ నడిపి సుంకన్న,బోయ జయన్న, బోయ అల్లి బాబు,కూర్వ మద్దిలేటి, కుర్వ డబ్బా ఆంజనేయులు,గొల్ల చిన్న నరసింహ,గ్రామ రైతు సంఘ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థినులకు ఆత్మరక్షణలో శిక్షణ

**మల్దకల్ సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం,ధైర్యాన్ని పెంపొందించడంతో పాటు ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పి.ఎం.శ్రీ జడ్పీహెచ్ఎస్ మల్దకల్‌లో సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది.మారుతి ఇన్‌స్ట్రక్టర్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మొత్తం 72 తరగతుల్లో ఆత్మరక్షణ శిక్షణ అందిస్తున్నారు.శిక్షణలో భాగంగా ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించడం, అప్రమత్తంగా వ్యవహరించడం,ఆత్మరక్షణకు సంబంధించిన ప్రాథమిక పద్ధతులను ప్రాక్టికల్‌గా నేర్పిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సురేష్ మాట్లాడుతూ,విద్యార్థినుల భద్రత, ఆత్మ విశ్వాసానికి సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.విద్యతో పాటు జీవిత నైపుణ్యాలను పెంపొందించుకోవడం కూడా విద్యార్థులకు ఎంతో అవసరమని పేర్కొన్నారు.విద్యార్థినులు ఉత్సాహంగా శిక్షణలో పాల్గొంటూ,నేర్చుకున్న ఆత్మరక్షణ పద్ధతులను క్రమం తప్పకుండా సాధన చేస్తున్నారు.





# నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

### - ఉద్యోగ నోటిఫికేషన్లు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి బీరెల్లి దానయ్య

**గద్వాల( ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 07:**

అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే చర్చించి స్పష్టమైన హామీ ఇవ్వాలని పివై ఎల్ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు బీరెల్లి దానయ్య డిమాండ్ చేశారు.ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నిరుద్యోగులకు ఉద్యోగాలు,విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.




# మండలంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తా

### - ఎర్రవల్లి మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన అధిష్ఠానానికి నర్సిరెడ్డి కృతజ్ఞతలు




**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 07:**

అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా తనను ఎంపిక చేయడం పట్ల నర్సిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు.మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేస్తానని నర్సిరెడ్డి సోమవారం తెలిపారు.పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి,ఏఐసీసీ కార్యదర్శి,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి తదితరులకు నర్సిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# రెండు రోజుల్లో నోటీసుల పంపిణీ పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**గద్వాల సెప్టెంబర్ 07(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లందరికీ రెండు రోజుల్లో నోటీసులు అందజేయడం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసుల అందజేత, హియరింగ్ అంశాలపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.గద్వాల ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ సమీక్షలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 1,49,282 నోటీసులు సిద్ధం చేయగా,ఇప్పటివరకు సుమారు 80 శాతం మంది ఓటర్లకు నోటీసులు అందజేసినట్లు తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి పారదర్శకమైన,సమగ్ర ఓటరు జాబితాను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ,ప్రతిరోజూ ఏఈఆర్ఓలు తమ పరిధిలోని సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.ఏ,బీ,సీ కేటగిరీల వారీగా నోటీసులు అందుకున్న ఓటర్లు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించేలా బీఎల్ఏల సహకారం తీసుకోవాలన్నారు.ఫారం-6, 7, 8 దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.ఎస్ఐఆర్ నేపథ్యంలో కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ నిర్దేశిత సమయంలోగా ధ్రువపత్రాలు మంజూరు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.రీ-సర్వే చేయాల్సిన గ్రామాలపై స్పష్టతతో ఉండాలని,ఇప్పటికే సర్వేయర్లకు శిక్షణ ఇచ్చినందున నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.అవసరమైన చోట లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు.విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా భూభారతి, సాదా బైనామా దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్,ఆర్డీవో శ్రీనివాసరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి,రాజ్ కుమార్,ఎన్నికల విభాగం అధికారి మంజుల,వివిధ మండలాల తహసీల్దార్లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్ బకాయిలు విడుదల చేయాలి

## భాజపా యువజన నాయకులు



**కృష్ణా సెప్టెంబర్ 07 (ప్రజా జ్యోతి)**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు దాదాపు 15 వేల కోట్లను విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేసినందుకు తెలంగాణ బిజెపి మరియు బీజేవైఎం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో భయపడిన అధికార కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి మరియు బీజేవైఎం నాయకులను అడ్డుకుని హౌస్ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇది ప్రజాస్వామ్య హక్కుల పై దాడి, యువత గొంతు నొక్కే ప్రయత్నం. పేద విద్యార్థుల పక్షాన నిలబడినందుకు మమ్మల్ని అడ్డుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోవు రోజుల్లో కచ్చితంగా తెలంగాణ సమాజం బుద్ధి చెబుతుంది. చట్టబద్ధమైన నిరసను అడ్డుకోవడం ఎవరికీ అధికారం లేదు. నిర్బంధించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాను. లేకపోతే మండల స్థాయిలో తీవ్ర ఆందోళనలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం భయపడిపోయి ఈ చర్యలను తీసుకుంటుంది. ప్రజల సమస్యలకు పరిష్కారం కాదు అణచివేతే పరిష్కారం అనుకుంటుంది. ఇది సహించం అన్నారు.

# కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర

## - మహబూబ్‌నగర్‌లో కాటూరి వెంకటేశ్వర్లుకు ఘన స్వాగతం

## - రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్న సంకల్పంతో 'రైస్ ఫర్ ఇండియా' నినాదం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే సంకల్పంతో "రైస్ ఫర్ ఇండియా" నినాదంతో కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు సుమారు నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టిన కాటూరి వెంకటేశ్వర్లు మహబూబ్‌నగర్ పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ కాటూరి వెంకటేశ్వర్లుకు స్వాగతం పలికి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి ఆహ్వానించారు. ఇప్పటికే మూడు రాష్ట్రాల్లో పాదయాత్ర పూర్తి చేసుకుని మహబూబ్‌నగర్‌కు చేరుకోవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి మెట్టుగడ్డ వరకు కాటూరి వెంకటేశ్వర్లుతో కలిసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అడుగులో అడుగు వేస్తూ పాదయాత్రలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కాంగ్రెస్ నాయకులు.. దేశంలో ఇప్పటివరకు జరిగిన పాలనలో అనేక లోపాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. ముఖ్యంగా పోటీ పరీక్షలు, ప్రశ్నపత్రాల లీకేజీల వ్యవహారం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువతలో ఉన్న ప్రతిభకు తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.దేశంలో సమర్థవంతమైన, ప్రజా సంక్షేమ పాలన కోసం రాబోయే కాలంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే లక్ష్యంతో కాటూరి వెంకటేశ్వర్లు చేపట్టిన పాదయాత్రకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ గుమ్మల్ మమత, బెక్కరి మధు, సత్తూరి చంద్రకుమార్ గౌడ్, కార్పొరేటర్ ప్రవీణ్ టెన్నీ, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు, వివిధ విభాగాల అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, సేవాదళ్ నాయకులు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ఉపాధ్యాయులే భావితరాలకు దిశానిర్దేశకులు

- విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే మహత్తర బాధ్యత ఉపాధ్యాయులదే,
- ఉపాధ్యాయులంటే నాకు ఎంతో గౌరవం
- మా తండ్రి కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడే
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 7**

**(ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

సమాజానికి మంచి పౌరులను అందించడంలో, భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతో ఉపాధ్యాయుల బాధ్యత ముగియదని, వారి వ్యక్తిత్వ వికాసానికి మార్గనిర్దేశం చేసి, జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత కూడా ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. సోమవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 70 మంది జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ. ఉపాధ్యాయులు అంటే నాకు అత్యంత గౌరవం. మా తండ్రి కూడా ఉపాధ్యాయుడే. అందువల్ల ఉపాధ్యాయ వృత్తి విలువ, సమాజంపై ఉపాధ్యాయుల ప్రభావం నాకు వ్యక్తిగతంగా తెలుసు అని కలెక్టర్ అన్నారు.విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల ప్రభావం ఎంతో గొప్పదని కలెక్టర్ అన్నారు. తరగతి గదిలో చెప్పే ప్రతి మాట, ఇచ్చే ప్రతి సూచన విద్యార్థుల ఆలోచనా విధానాన్ని, వారి భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని తెలిపారు. అందువల్ల ప్రతి విద్యార్థిని ప్రత్యేకంగా గుర్తించి, వారి సామర్థ్యాలను వెలికితీసేలా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు.విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానం అందించడం మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, సమయపాలన, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథం వంటి మంచి లక్షణాలను పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరించే పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల ప్రధాన కర్తవ్యమని తెలిపారు.ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ యుగంలో ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు కూడా తమ బోధనా పద్ధతులను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, సమస్య పరిష్కార సామర్థ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అభినందనలు తెలిపారు. ఈ సన్మానం ఉపాధ్యాయులు విద్యారంగానికి అందిస్తున్న సేవలకు లభించిన గౌరవానికి ప్రతీక అని అన్నారు. అవార్డుతో బాధ్యత మరింత పెరుగుతుందని, ఇతర ఉపాధ్యాయులకు కూడా ఆదర్శంగా నిలిచి విద్యార్థుల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి జీవితాన్నే కాదు.. ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని, ఒక తరాన్ని ప్రభావితం చేయగలడు అనే భావనతో ప్రతి ఉపాధ్యాయుడు తన బాధ్యతను నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల విజయమే ఉపాధ్యాయుల సేవలకు నిజమైన గుర్తింపు అని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఏ రమేష్ కుమార్, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, నూరుద్దీన్, కురుమయ్య, రాజశేఖర్ రావు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# పాఠశాలల్లో పారిశుధ్య పనుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

## - మాడ్రన్ పాఠశాలలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.. హెచ్ఎంకు షోకాజ్ నోటీసు





**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ హెచ్చరించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంలో అలసత్వాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.సోమవారం మహబూబ్‌నగర్‌లోని మాడ్రన్ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) లక్ష్మణ్ సింగ్‌తో కలిసి అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదుల పరిసరాలను పరిశీలించిన ఆయన.. అక్కడ పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం, చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు పాఠశాలల్లో పరిశుభ్రత అత్యంత కీలకమని పేర్కొన్న అదనపు కలెక్టర్.. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి బాధ్యత వహించాల్సిన ప్రధానోపాధ్యాయుడి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యుడికి వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎంఈఓను ఆదేశించారు.

పాఠశాల ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా తక్షణ చర్యలు చేపట్టాలని, పారిశుధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. "విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రతి పాఠశాల బాధ్యత. పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహించే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" అని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు.

# 20 హామీలు.. వెయ్యి రోజుల పాలన.. ప్రజలకు మిగిలిందేమిటి?"

మొదటిపేజీ తరువాయి

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి వెళ్లకుండా అరెస్టులు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై మాట్లాడే గొంతులను అణచివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని అన్నారు. పింఛన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యేలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.

### "ప్రశ్నిస్తే అరెస్టులా?":

మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఎమ్మెల్యేలపై దౌర్జన్యానికి పాల్పడి గాయపరిచారని, అవమానకరంగా ప్రవర్తించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించకుండా అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తోందని విమర్శించారు. తులం బంగారం, స్కూటీలు, ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఏ భూముల సమస్యలపై ప్రశ్నిస్తారనే భయంతోనే ప్రభుత్వం ప్రతిపక్ష గొంతును అణచివేస్తోందని ఆయన ఆరోపించారు.

### పాలమూరు రైతుల గోడు పట్టదా?:

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలో పూర్తయిన రిజర్వాయర్లను కూడా పూర్తిస్థాయిలో నింపడం లేదని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. మరోవైపు వెలిగొండ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీరు తరలిపోతున్నా జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పంటలు ఎండిపోతున్నా రైతుల గోడు ప్రభుత్వానికి పట్టడం లేదని, రైతుబంధు, రుణమాఫీ, పంట బోనస్ వంటి అంశాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల సమస్యలపై త్వరలో కేసీఆర్ నేరుగా రంగంలోకి దిగనున్నారని, పాలమూరు ప్రాజెక్టును సందర్శించనున్నారని తెలిపారు.

### హామీల జాబితా.. అమలు ఎక్కడ?:

మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, తులం బంగారం, స్కూటీ, రైతులకు ప్రతి పంటకు రైతు భరోసా, పంటలకు బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల సహాయం వంటి హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. అదేవిధంగా అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు విద్యా భరోసా, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు రూ.4 వేల పెన్షన్, ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు పీఆర్సీ, టీఏ, డీఏలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.

### ప్రజావాణికీ పోలీసు ఆంక్షలా?:

ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రజావాణి కార్యక్రమంలోనూ ఆంక్షలు పెట్టడం సరికాదని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రజల గొంతును వినాల్సిన ప్రభుత్వం, ప్రజల తరఫున ప్రశ్నించే వారిని అడ్డుకుంటోందని విమర్శించారు.అనంతరం బీఆర్ఎస్ ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, కార్పొరేటర్లు ఈశ్వరయ్య, నవకాంత్, శరత్, సత్యం, మధుమోహన్, సీనియర్ నాయకులు శ్రీనునాయక్, నరేందర్, కుర్వ శ్రీశైలం, నరేష్, జహంగీర్, క్రాంతి, కట్ట రవికిషన్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, సుధాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు!

## - మహబూబ్‌నగర్‌లో రెండు ఆస్పత్రుల్లో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు

## - ఫైర్ సేఫ్టీ, సిబ్బంది వివరాలు, ఛార్జీల చార్ట్‌పై స్పష్టమైన ఆదేశాలు

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలని, నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం మహబూబ్‌నగర్ నగరంలోని శ్రీకర చిల్డ్రన్స్ హాస్పిటల్, భవిత సూపర్ స్పెషల్టీ హాస్పిటల్లను డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, రికార్డులు, వైద్యులు, ఇతర సిబ్బంది వివరాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు.

**ఫైర్ సేఫ్టీపై ప్రత్యేక దృష్టి:**

శ్రీకర చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లను పరిశీలించిన డీఎంహెచ్‌ఓ.. అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు ఫైర్ ఆడిట్, మాక్ డ్రిల్స్ నిర్వహించాలని స్పష్టం చేశారు.

**సిబ్బంది మారితే ముందస్తు సమాచారం తప్పనిసరి:**

ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన వైద్యులు లేదా ఇతర సిబ్బందిలో మార్పులు చోటుచేసుకుంటే, ఆ వివరాలను వెంటనే జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయానికి తెలియజేసి ముందస్తు అనుమతి పొందాలని ఆదేశించారు.

**రోగులకు కనిపించేలా తెలుగు ఛార్జీల చార్ట్:**

ఆస్పత్రుల్లో అందించే వివిధ వైద్య సేవలకు సంబంధించిన ధరల వివరాలను రోగులు, వారి బంధువులకు స్పష్టంగా తెలిసేలా ఛార్జీల పట్టికను తప్పనిసరిగా తెలుగులో, అందరికీ కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలని డీఎంహెచ్‌ఓ స్పష్టం చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనల అమలుపై తనిఖీలు కొనసాగుతాయని, రోగుల



ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వైద్య సేవల్లో పారదర్శకత, భద్రత, నాణ్యత పాటించాలని డా. శ్రీనివాసులు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత ఆస్పత్రులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. శివకాంత్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సీతారామ్ గౌడ్, హెల్త్ ఎడ్యుకేటర్లు హన్మంతు, నర్సింహా, సుభాష్ చంద్ర తదితర వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు గళాన్ని అణిచివేస్తారా?

## - రామ్మోహన్‌రెడ్డి అరెస్టు కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం: పల్లె మారెప్ప



**మాగనూరు, సెప్టెంబర్07(ప్రజా జ్యోతి)**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులను నిరసిస్తూ ఆందోళన చేపట్టిన మక్తల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని బీఆర్‌ఎస్ మాగనూరు మండల యువజన అధ్యక్షుడు పల్లె మారెప్ప తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న నాయకుడిని అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రైతు సమస్యలు, రైతు వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడుతున్న రామ్మోహన్‌రెడ్డిని అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని పల్లె మారెప్ప ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీకి, రామ్మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ప్రజాదరణను చూసి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందని ఆరోపించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని పల్లె మారెప్ప హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం

## - 40 మంది వార్డు అధికారులకు మెమోలు! - రూ.53 కోట్ల ఆస్తిపన్ను

## డిమాండ్‌లో వసూలైంది రూ.16 కోట్లే.. నీటి పన్నులోనూ రూ.19 కోట్ల బకాయి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్లు, పౌర సేవలు, పెండింగ్ అంశాల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిలో ఆశించిన స్థాయిలో పనితీరు లేకపోవడంపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న 40 మంది వార్డు అధికారులకు మెమోలు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో కమిషనర్ రామానుజుల రెడ్డి, కార్పొరేషన్ అధికారులు, 40 మంది వార్డు అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా పన్నుల వసూళ్లు, పౌర సేవలు, పెండింగ్ కేసులు, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని ఆయన సమీక్షించారు.

### రూ.37 కోట్ల ఆస్తిపన్ను బకాయి:

ఆస్తిపన్ను వసూళ్లపై సమీక్షలో ఆసక్తికర గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. కార్పొరేషన్ పరిధిలో మొత్తం ఆస్తిపన్ను డిమాండ్ రూ. 53 కోట్లు కాగా, ఇప్పటివరకు కేవలం రూ. 16 కోట్లు మాత్రమే వసూలైనట్లు అధికారులు తెలిపారు. ఇంకా రూ. 37 కోట్లు బకాయి ఉన్న నేపథ్యంలో వసూళ్లను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

### నీటి పన్నులోనూ భారీ బకాయిలు:

నీటి పన్ను వసూళ్ల పరిస్థితిపైనా అదనపు కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం డిమాండ్ రూ. 29 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ. 10 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. మరో రూ. 19 కోట్లు బకాయి ఉన్నందున వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

### 450 మరణ ధృవీకరణ కేసులు పెండింగ్:

ప్రజలకు నేరుగా అందాల్సిన సేవల్లో భాగమైన మరణ ధృవీకరణ పత్రాల జారీకి సంబంధించి 450 కేసులు పెండింగ్‌లో ఉండటంపై అదనపు కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

### 243 ఇందిరమ్మ ఇళ్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదు:

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపైనా సమీక్ష నిర్వహించిన ఆయన.. 243 ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, పురోగతిని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

### రోజువారీ లక్ష్యాలు తప్పనిసరి:

పన్నుల వసూళ్లు, మరణ ధృవీకరణ కేసుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి తదితర అంశాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 40 మంది వార్డు అధికారులకు మెమోలు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను అదనపు కలెక్టర్ ఆదేశించారు.ప్రతి వార్డు అధికారికి స్పష్టమైన రోజువారీ లక్ష్యాలను నిర్దేశించి, వాటిని





తప్పనిసరిగా పూర్తి చేసేలా పర్యవేక్షించాలని సూచించారు. పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. లక్ష్యాల సాధనలో విఫలమయ్యే వార్డు అధికారులపై చర్యలు తీసుకునేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ హెచ్చరించారు. ప్రజలకు అందాల్సిన పౌర సేవల్లో ఎలాంటి జాప్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. పన్నుల వసూళ్లు, పెండింగ్ కేసుల పరిష్కారం, ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని రోజువారీ లక్ష్యాల మేరకు పనితీరు కనబరచాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

## వెన్నచేడ్ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య

**(ప్రజాజ్యోతి గండీడ్):**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వెన్నచేడ్ గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెన్నచేడ్ గ్రామంలోన్నిగాూ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, వారిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు జిల్లాస్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ర్యాంకులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆకాంక్షించారు.నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం పెంపొందించి, సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



# Hiమాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అరెస్ట్

## అక్రమ అరెస్టులను నిరసిస్తూ నర్వ పోలీస్ స్టేషన్ ముందు ధర్నా టిఆర్ఎస్ కార్యకర్తల ధర్నా





**నర్వ సెప్టెంబరు 7 ప్రజా జ్యోతి**

మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని సోమవారం పోలీసులు అరెస్టు చేసి నర్వ పోలీస్ స్టేషన్లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి తో పాటు బి ఆర్ఎస్ మండల నాయకులను మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు బైండోవర్ అరెస్టు చేశారు, ఈ సందర్భంగా చిట్టెం రామ్మోహన్ రెడ్డి, టిఆర్ఎస్ మండల నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు చేయలేదని నిలదీసి అడిగితే అక్రమ అరెస్టులు చేయడం చేతగానితనమని అన్నారు, ప్రజా సమస్యల కొరకు ఎంతవరకైనా తెగించి పోరాడుతామని ఇటువంటి అరెస్టులను ఎన్నో చూశామని ఆయన అన్నారు, నాలుగు గంటల పాటు పోలీస్ స్టేషన్ లో నిర్బంధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతగానితనమని ఆయన ఆరోపించారు, అరెస్ట్ అయిన వారిలో మక్తల్ మాజీ మార్కెట్ చైర్మన్ నరసింహులు గౌడ్, నర్వ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి , దండు అయ్యప్ప, డాక్టర్ శంకర్, లక్ష్మణ లతో పాటు మరో 30 మంది ఉన్నారు

# పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులపై కలెక్టర్ సీరియస్!

## - రెండు రోజుల్లో పరిష్కరించాలి.. ప్రతి ఫిర్యాదుపై ఏ టి ఆర్ తప్పనిసరి

## - ప్రజావాణిలో 62 ఫిర్యాదుల స్వీకరణ



**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించే ప్రజావాణి ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ, రెవెన్యూ సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు, ఉపాధి, రహదారులు, తాగునీరు, గృహ నిర్మాణం తదితర అంశాలపై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 62 ఫిర్యాదులు స్వీకరించారు.

**పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి:**

ప్రజావాణి అనంతరం పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి, జిల్లా ప్రజావాణి దరఖాస్తులపై కలెక్టర్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను అధికారుల గ్రూపుల్లో పంపించి, ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యలు, పరిష్కరించిన విధానం, దరఖాస్తుదారులకు అందించిన సమాచారం తదితర వివరాలతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ను తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. పరిష్కరించడం సాధ్యం కాని దరఖాస్తుల విషయంలో అందుకు గల కారణాలను స్పష్టంగా నివేదికలో పేర్కొనాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను రెండు రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను కూడా రాతపూర్వకంగా సమర్పించాలని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో నివేదికలను అప్‌లోడ్ చేయాల్సి ఉన్నందున చిన్నచిన్న సమస్యలను సైతం పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించి వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.

**మున్సిపాలిటీలపై ప్రత్యేక ఫోకస్:**

మహబూబ్‌నగర్, జడ్చర్ల మున్సిపాలిటీలతో పాటు ఇతర శాఖల్లో ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. భూత్పూర్ మున్సిపాలిటీలో పెండింగ్ దరఖాస్తుల వివరాలను సేకరించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు హాస్టల్ కేటాయింపులకు సంబంధించిన దరఖాస్తులను అర్హతల ఆధారంగా పరిశీలించి పరిష్కరించాలని, అర్హత లేని సందర్భాల్లో కారణాలను స్పష్టంగా పేర్కొని దరఖాస్తును క్లోజ్ చేయాలని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో ఫీల్డ్ వెరిఫికేషన్ అవసరమైన దరఖాస్తులను వెంటనే పరిశీలించి విచారణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పిటిషన్ల విభాగంలో పెన్షన్ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా ఉన్నందున వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరితగతిన పరిష్కరించి ఏటిఆర్ లు సమర్పించాలని సూచించారు. ఎస్పీ కార్యాలయానికి సంబంధించిన ప్రజావాణి దరఖాస్తులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నివేదికలను వెంటనే సేకరించాలని ఆదేశించారు. ఫీల్డ్ స్థాయి అధికారులు చురుగ్గా పనిచేసి పెండింగ్ కేసులను త్వరితగతిన క్లోజ్ చేయాలని, అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని దరఖాస్తులకు సంబంధించి అవసరమైన ఏటిఆర్ లను తప్పనిసరిగా సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్పీసీఈఓ ఇన్‌చార్జి డీపీఓ వెంకట్ రెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, గృహనిర్మాణ శాఖ పీడీ ఉపేందర్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు కరెంటు ఇవ్వకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## రైతులకు సక్రమంగా కరెంటు అందించాలని

## ప్రజావాణిలో బిఆర్ఎస్ ఫిర్యాదు

రైతులు పంటలు పండించుకునేందుకు సరిపడా కరెంట్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని సోమవారం మాగనూరు ప్రజా పరిషత్ కార్యాలయం ప్రజావాణిలో బిఆర్ఎస్ నాయకులు మాజీ శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పిర్యాదు చేశారు. కెసిఆర్ హయంలో 24 గంటల నిరంతర కరెంటు ఇచ్చి రైతులు పుష్కలంగా పంటలు పండించుకున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో కనీసం 9 గంటల కరెంటు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్ గ్యారంటీలు 420 ఆమెలిచ్చి గోరంగా ప్రజలు మోసం చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ అని మండిపడ్డారు. రైతుల పొలాలు ఎండకు ముందే కరెంట్ సక్రమంగా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి. గ్రా ూా జ ూా అధ్యక్షులు వెంకట్ రెడ్డి. సర్పంచ్ లు రాఘవేందర్ రెడ్డి లక్ష్మప్ప నర్సింహా మాజీసర్పంచులు. మల్లారెడ్డి. పోస్ట్ అశోక్ గౌడ్. సుతారి రవి. పల్లె మారెప్ప. పూల రాము. శంకర్ గౌడ్. మొగులప్ప. శంక్రప్ప. శివరాం. చాలీమ్. గజపతి.జమీల్. బాలప్ప. వాకిటి రాజు. సాయప్ప తదితరులు పాల్గొన్నారు..



# ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న తూడుకుర్తి గ్రామానికి చెందిన ఖాజా సలీం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఖాజ సలీం గణిత ఉపాధ్యాయుడిగా పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపు, నూతనంగా సహ పాఠ్యాంశాలను బోధించడం, విద్యార్థులలో సామాజిక చైతన్యాన్ని నింపడం, జిల్లాలోనే గణితంలో 10వ తరగతి పరీక్షల్లో మూడవ ర్యాంకు సాధించే విధంగా ఒక విద్యార్థిని తీర్చిదిద్దడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ఖాజ సలీం ను ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. 25 సంవత్సరాల అనుభవంతో విద్యార్థులను డిజిటల్ లెర్నింగ్, విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసి వారిని ఉత్తములుగా తీర్చిదిద్దడంలో చేసిన కృషికిగాను ఈ అవార్డు అందించారు. తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం కలెక్టర్ గారితో సన్మానం పొందడం పట్ల ఖాజ సలీం కృతజ్ఞతలు తెలిపారు.

# యూజీసీ-నెట్‌కు పటిష్ట ఏర్పాట్లు

## - సెప్టెంబర్ 9, 10న మహబూబ్‌నగర్‌లో పరీక్షలు..

## - కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హతల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే యూజీసీ-నెట్ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో విద్య, పోలీస్, విద్యుత్, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులతో జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

**రెండు రోజుల పాటు మూడు కేంద్రాల్లో పరీక్షలు:**

సెప్టెంబర్ 9, 10 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎం.ఎస్.ఎన్. ఇన్ఫోటెక్ సర్వీసెస్, ఫాతిమా విద్యాలయ, క్రిస్టియన్‌పల్లి పరీక్షా కేంద్రాల్లో యూజీసీ-నెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 9న ఉదయం, సాయంత్రం రెండు షిఫ్టుల్లో, సెప్టెంబర్ 10న మొదటి షిఫ్ట్‌లో ఇంగ్లీష్, కామర్స్, సోషియాలజీ తదితర సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు.

**కేంద్రాల వద్ద నిఘా.. మౌలిక వసతులు:**

పరీక్షా కేంద్రాలకు సమీపంలోని 200 నుంచి 300 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను తాత్కాలికంగా మూసివేయాలని సూచించారు. కేంద్రాల్లో బయోమెట్రిక్ వెరిఫికేషన్, సీసీ కెమెరాల నిఘా, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. అభ్యర్థుల రవాణా సౌకర్యార్థం పరీక్షా కేంద్రాలకు వెళ్లే మార్గాల్లో అవసరమైన ప్రత్యేక బస్సు సర్వీసులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స సేవలు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. దివ్యాంగ అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రౌండ్ ఫ్లోర్‌లోనే సీటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

**అభ్యర్థులు నిబంధనలు పాటించాలి:**

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎన్‌టీఏ జారీ చేసిన అడ్మిట్ కార్డుతో పాటు ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ వంటి ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలని అదనపు కలెక్టర్ సూచించారు. బయోమెట్రిక్ వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, నిర్ణీత సమయం దాటిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావద్దని సూచించారు. అభ్యర్థులు నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ వై. సురేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, ఎన్ఐసీ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు 24 గంటల విద్యుత్తు వదలాలి

## లేదంటే ఆందోళనలు చేపడతాం బిఆర్ఎస్

## నర్వ మండల పరిషత్ కార్యాలయం ముందు బిఆర్ఎస్ నాయకుల ధర్నా

**నర్వ సెప్టెంబరు 7 ప్రజా జ్యోతి**

రైతులకు తక్షణమే 24 గంటల విద్యుత్ను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ నాయకులు సోమవారం నారాయణపేట జిల్లా నర్వ మండల పరిషత్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు, అంతకంటే ముందు ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు, ఎంపీడీవో శ్రీనివాసులుకు వినతి పత్రాన్ని సమర్పించారు, అనంతరం ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రైతులకు కరెంటు కష్టాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఆయాంలో తప్ప లేదని ఆరోపించారు, తక్షణమే 24 గంటల విద్యుత్తును సరపర చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఆయములో రైతులకు కరెంటు కష్టాలు తప్పడం లేదని ఆరోపించారు తక్షణమే ప్రభుత్వం స్పందించి విద్యుత్తును 24 గంటల కు పెంచాలన్నారు, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని డిమాండ్ చేశారు, ప్రస్తుతం రైతులకు వర్షాకాలంలో వర్షాలు లేక బోర్లలో నీళ్లు ఎండిపోయి సకాలంలో వరి పొలాలకు నీళ్లందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు, ఈ కార్యక్రమాలలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, లక్ష్మణ, డాక్టర్ శంకర్, దండు అయ్యప్ప, వడ్డే ఆంజనేయులు, శ్రీకాంత్ రెడ్డి, రాయకుడు కాజా, ఎండి రఫీ, నర్వ బుజ్జన్న, వడ్డే లింగన్న ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,



# కలెక్టరేట్‌లో విజయ డైరీ పార్లర్ ప్రారంభం

## - ఇందిరా మహిళా శక్తి మహబూబ్‌నగర్

## మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహణ

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విజయ డైరీ పార్లర్‌ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి మహబూబ్‌నగర్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ పార్లర్‌ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, విజయ డైరీకి సంబంధించిన వివిధ రకాల పాల ఉత్పత్తులను పార్లర్‌లో అందుబాటులో ఉంచి విక్రయించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌కు వచ్చే అధికారులు, సిబ్బంది, ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు సులభంగా అందుబాటులో ఉండేలా పార్లర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పార్లర్ నిర్వహణ చేపట్టడం ద్వారా మహిళా సంఘాలకు ఉపాధి, ఆర్థిక అవకాశాలు మరింత మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, డీఆర్‌డీఓ నరసింహులు, జిల్లా డైరీ శాఖ డీడీ శ్రీనివాస్, మహిళా సమాఖ్య సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# బాలకృష్ణమ్మ కుటుంబానికి శ్రీనివాస్ గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శ

## - చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు..

## కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఇటీవల పరమపదించిన తోకల బాలకృష్ణమ్మ కుటుంబాన్ని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. మహబూబ్‌నగర్‌లోని ఎదిర గ్రామానికి వెళ్లిన వారు బాలకృష్ణమ్మ కుటుంబ సభ్యులు కృష్ణ, శ్రీకాంత్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. అనంతరం బాలకృష్ణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా ఇటీవల పరమపదించిన టి. ఈశ్వర్ చిత్రపటానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈశ్వర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.



# టి.వెంకటయ్య సేవలు చిరస్మరణీయం

### విద్యా సేవలతో వెలుగులు నింపిన వెంకటయ్య

### సామాజిక చైతన్యానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం

### రెండో వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు

**మహమ్మదాబాద్:**

విద్యారంగంతో పాటు సామాజిక చైతన్యం కోసం విశేషంగా కృషి చేసిన కీర్తిశేషులు గాదిర్యాల్ టీ. వెంకటయ్య టీచర్ సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు కొనియాడారు. ఆయన రెండో వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం గాదిర్యాల్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటయ్య టీచర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మహమ్మదాబాద్ మండలం గాదిర్యాల్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు టీ. వెంకటయ్య విద్యాబోధనకే పరిమితం కాకుండా సామాజిక చైతన్యం కోసం నిరంతరం కృషి చేశారని అన్నారు. ముఖ్యంగా దళిత సమాజ అభ్యున్నతికి, విద్యార్థుల ఉన్నతికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు.వెంకటయ్య ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, వివిధ సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శాంతిబాయ్, ఉపాధ్యాయుడు బోరు కృష్ణయ్య, జి. చంద్రయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, జి. ఆంజనేయులు, బి. రామకృష్ణ, బచ్చనోళ్ల కృష్ణయ్య, జి. కృష్ణయ్య తదితర నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# అంకితభావానికి అవార్డుల కిరీటం

### మాగనూరులో 14 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం

**మాగనూరు, సెప్టెంబర్07(ప్రజా జ్యోతి)**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాగనూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 14 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ఘనంగా అందజేశారు.మండల విద్యాధికారి గణేష్ సింగ్, మాగనూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాబు రెడ్డి, నేరేడగం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 14 మందిని అవార్డులతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ఎంఈఓ గణేష్ సింగ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విధి నిర్వహణలో చూపుతున్న అంకితభావానికి గుర్తింపుగా అందించే అవార్డులు వారిలో మరింత స్ఫూర్తి, ఉత్సాహాన్ని నింపుతాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# PRC పై ఉద్యోగుల సమరశంఖం!

### సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్

### డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదు: TGEJAC

**మాగనూరు, సెప్టెంబర్07(ప్రజా జ్యోతి)**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం ఇకనైనా స్పందించాలని, లేదంటే ఉద్యమ సెగను ఎదుర్కోవాల్సి వస్తుందని ι+జుజీూజ నారాయణపేట జిల్లా చైర్మన్ నరసింహారెడ్డి హెచ్చరించారు. మాగనూరులో సెప్టెంబర్ 10న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉద్యోగుల హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్నామని, ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ రిపోర్టును వెంటనే ప్రకటించి అమలు చేయాలని, ఆరు డీఏలను విడుదల చేయడంతో పాటు పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. జ్బూ ఉద్యోగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగుల ఆర్థిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఇకపై జాప్యం చేయొద్దన్నారు.ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. సెప్టెంబర్ 10న రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి తమ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాగనూరు తహసీల్దార్ రెహమాన్, ఎంపీడీవో శ్రీనివాసులు, ι+జుజీూజ నాయకులు దామోదర్, వెంకటస్వామి, రాంగోపాల్, పరంధాములు, మక్తల్ చైర్మన్ మునావర్ అలీ, పంచాయతీ కార్యదర్శులు తిమ్మప్ప, నరసింహారెడ్డి, బాలరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ సీఆర్‌పీగా దయ్యపు వెంకటేష్‌కు ఘన సత్కారం

### ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డీఈవో చేతుల మీదుగా పురస్కారం

**వీపనగండ్ల, ప్రజా జ్యోతి రిపోర్టర్ :**

మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయంలో సీఆర్‌పీగా విధులు నిర్వహిస్తున్న దయ్యపు వెంకటేష్ ఉత్తమ సీఆర్‌పీగా ఎంపికై పురస్కారం అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి యాదగిరి చేతుల మీదుగా వెంకటేష్‌కు ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు.విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయులకు అవసరమైన విద్యా సహకారం అందిస్తూ, తన విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్న వెంకటేష్ సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉత్తమ సీఆర్‌పీగా పురస్కారం అందుకోవడంతో మండలంలోని ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు వెంకటేష్‌ను ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, వెంకటేష్ మరింత అంకితభావంతో పనిచేసి విద్యారంగానికి సేవలందించాలని ఆకాంక్షించారు. మండలానికి మంచి గుర్తింపు తీసుకువచ్చినందుకు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.



# ప్రజల సమస్యల పరిష్కారానికై ప్రజావాణి

## - ప్రజావాణిలో 11 ఫిర్యాదులు వచ్చాయి - జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

ప్రజల సమస్యల పరిష్కారానికై ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్పష్టం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయంలోఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన 11 అర్జీలలో  భూమికి సంబంధించిన అర్జీలు 05, తగు న్యాయం సంబంధించిన అర్జీలు 05 ,భార్య భర్తల గొడవలు 01 ,స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్స్ పోలీస్ అధికారులకు ఆదేశించారు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్నివినియోగించుకుంటూ,వారి సమస్యలు చట్ట ప్రకారంపరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదుదారులు తదితరులు ఉన్నారు



## దేవరకద్రలో కాంగ్రెస్, బీజేపీలకు షాక్..

## గులాబీ గూటికి 500 మంది!

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో భారీగా చేరికలు..

- “రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. కేసీఆర్ కాబోయే సీఎం”

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

దేవరకద్ర నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు చోటుచేసుకున్నాయి. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం గ్రామానికి చెందిన మోహన్‌కుమార్, మాజీ ఎంపీటీసీ మైబు, బాలయ్యతో పాటు సుమారు 500 మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఈ చేరికల సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అధికారంలో ఉన్న జాతీయ పార్టీలు తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు మరోసారి బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాబోయే సీఎం కేసీఆర్ అని ధీమా వ్యక్తం చేశారు.

**“కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారు”:**

కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు సాగిందని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, అన్ని వర్గాల ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు.బీఆర్ఎస్‌లోకి కొత్తగా వచ్చిన కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కొత్త, పాత అనే తేడా లేకుండా అందరూ సమన్వయంతో పనిచేసి కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాజా చేరికలతో దేవరకద్ర నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనగా, కాంగ్రెస్, బీజేపీ శిబిరాల్లో మాత్రం ఈ పరిణామం రాజకీయ చర్చకు దారితీసింది.



## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి..

## చలో హైదరాబాద్‌కు కదం..

## CITU జిల్లా నాయకులు భరత్‌కుమార్..

**మాగనూరు, సెప్టెంబర్ 07 (ప్రజా జ్యోతి)**

ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న చలో హైదరాబాద్ ధర్నాకు మాగనూరు, కృష్ణ మండలాల ఆశా కార్యకర్తలు తరలిరానున్నారు. ఈ మేరకు మాగనూరు పీహెచ్‌సీ డాక్టర్ అప్రోచ్‌కు ముందస్తుగా వినతిపత్రం అందజేశారు.గత 20 ఏళ్లుగా ఆశా వర్కర్లు గర్భిణీలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించడంతో పాటు అంటువ్యాధుల నివారణ, షుగర్, థైరాయిడ్, క్యాన్సర్ తదితర వ్యాధిగ్రస్తులకు ఇంటింటికీ వెళ్లి సేవలందిస్తున్నారని జ×ఖ జిల్లా నాయకులు భరత్‌కుమార్ తెలిపారు. అయితే ప్రభుత్వం వారి సేవలకు తగిన ప్రయోజనాలు కల్పించకుండా కాలయాపన చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత, పెండింగ్ బిల్లుల విడుదల, చీజణ ఆన్‌లైన్ పనులు మరియు అదనపు భారాలను తొలగించడం,ాచీజూచీజ టార్గెట్ల రద్దు వంటి డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆదివారాలు, పండుగలకు సెలవులు, క్యాజువల్, మెడికల్ సెలవులు, రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ాచీవీ+చీవీ పోస్టుల్లో ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 14న ప్రజావాణిలో సమర్పించిన వినతిపత్రంలోని అన్ని డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పార్వతమ్మ, పారిజాత, సుమిత్ర, ఉజ్జలి, రేణుక, సరిత, మహేశ్వరి, వెంకటమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



ప్రజాజ్యోతి
08 మంగళవారం, సెప్టెంబర్ 2026

# ఎడ్లబండ్లతో కాంగ్రెస్ హామీలపై నిరసన..

# మదనాపూర్‌లో బీఆర్ఎస్ పోరుబాట

## - ఆరు గ్యారెంటీలు.. 420 హామీల అమలేది? వెయ్యి రోజుల దగా పాలన అంటూ ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ధ్వజం

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మదనాపూర్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఎడ్లబండ్లతో ర్యాలీ చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.

అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు నల్ల జెండాలు, నల్ల దుస్తులతో ఆత్మకూరువనపర్తి ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆల ప్రీతిరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





### "వెయ్యి రోజుల పాలన.. హామీల అమలెక్కడ?":

ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ హామీల అమలు కోసం ఆరు రోజులుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజాక్షేత్రంతో పాటు అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రయత్నించగా వారిని పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని ఆరోపించారు. నల్ల దుస్తులతో నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.

### "పోలీసులతో గొంతు నొక్కలేరు":

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని, పలువురికి గాయాలయ్యాయని ఆల ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు అమానవీయంగా ప్రవర్తించారని విమర్శించారు. "పోలీసులను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ గొంతును నొక్కలేరు. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ఆపేది లేదు. ప్రభుత్వం హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తాం" అని స్పష్టం చేశారు.

### అన్ని వర్గాల హామీలు అమలు చేయాలని డిమాండ్:

రైతులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. నిరసన అనంతరం బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

## జంగం రెడ్డిపల్లిలో కృష్ణారెడ్డికి శాలువాతో సత్కరించిన బీజేపీ నాయకులు, గ్రామస్తులు

**గండీడ్:** రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందిన గండీడ్ మండలం జంగం రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇబ్రహీంబాద్ కృష్ణారెడ్డిని జంగం రెడ్డిపల్లి గ్రామ బీజేపీ నాయకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణారెడ్డికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించిన సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు నరహరెడ్డి ఆధ్వర్యంలో కృష్ణారెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి కృష్ణారెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఆయనకు రాష్ట్రస్థాయి అవార్డు రావడం జంగం రెడ్డిపల్లి గ్రామానికే గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యారంగంలో మరిన్ని సేవలు అందించి మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొని కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రజాజ్యోతి

08 మంగళవారం, సెప్టెంబర్ 2026

# వినాయక నవరాత్రులకు పోలీస్ పకడ్బందీ బందోబస్తు

## విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు అప్రమత్తంగా ఉండాలి: డీజీపీ సీవీ ఆనంద్

### మహబూబ్‌నగర్‌లో ఏర్పాట్లపై డీజీపీకి వివరించిన ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, ఆదేశించారు. సోమవారం అన్ని జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్తు, మండపాల భద్రత, నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షించారు. విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ సూచించారు. మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్లు, జనరేటర్లు, అగ్నిప్రమాదాల నివారణ వంటి అంశాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మహిళలు, పిల్లలు, వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**మండపాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి:**

వినాయక మండపాల నిర్వాహకులు తమ మండపాల పూర్తి వివరాలను పోలీస్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని డీజీపీ సూచించారు. మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకుల పేర్లు, ఫోన్ నంబర్లు, విగ్రహ వివరాలను నమోదు చేయాలని తెలిపారు. సంబంధిత అధికారుల అనుమతులు తీసుకున్న తర్వాతే మండపాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

**నిమజ్జనంపై ప్రత్యేక నిఘా:**

నిమజ్జనం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున నిమజ్జన మార్గాలు, ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాలను ముందుగానే గుర్తించి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని డీజీపీ ఆదేశించారు. అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు, బ్యారికేడింగ్, పార్కింగ్, లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో ప్రజలు నీటిలోకి వెళ్లకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని, అత్యవసర సేవల వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

**సోషల్ మీడియాలో వదంతులపై నిఘా:**

ఉత్సవాల సందర్భంగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం, వదంతులు, రెచ్చగొట్టే సందేశాలు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డీజీపీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా




ఎవరైనా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**జిల్లా ఏర్పాట్లను వివరించిన ఎస్పీ జానకి:**

వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి జిల్లాలో చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను డీజీపీకి వివరించారు. ప్రధాన మండపాలు, నిమజ్జన ప్రాంతాలను గుర్తించి భద్రతాపరంగా పరిశీలిస్తున్నామని, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్ తదితర శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించి ఉత్సవాల విజయవంతమైన నిర్వహణకు సహకరించాలని కోరింది. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, బాలాజీ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ.. పరిష్కారంపై ఎస్పీ ప్రత్యేక దృష్టి

## ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించాలి.. జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎస్పీ జానకి ఆదేశం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునే లక్ష్యంతో జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకురాగా, ఆమె ప్రతి ఫిర్యాదును ఓపికగా విని సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, ఫిర్యాదులను నిబంధనల ప్రకారం పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



**జాప్యం చేస్తే సహించం..:**

ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని, సమస్య స్వభావాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను పోలీసు శాఖ దృష్టికి తీసుకురావడానికి ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ఎస్పీ జానకి తెలిపారు. ప్రజలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందుతున్న ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి, అర్హత మేరకు బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు.

ప్రజాజ్యోతి
08 మంగళవారం, సెప్టెంబర్ 2026

# రాహుల్ ఆశయాల కోసం వేల కిలోమీటర్ల పాదయాత్ర

## - 'రాగా ఫర్ ఇండియా' యాత్రకు డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ సంఘీభావం..

## - పాలమూరు గడ్డపై ఘన స్వాగతం

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం చేపట్టిన 'రాగా ఫర్ ఇండియా ' జాతీయ పాదయాత్రకు మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు వేల కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తున్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది, సామాజిక కార్యకర్త కాటూరి వెంకటేశ్వర్లు యాత్రకు డీసీసీ అధ్యక్షుడు ఎ. సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని భారత ప్రధానిగా చూడాలనే సంకల్పంతో ఆయన ఆలోచనలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వెంకటేశ్వర్లు చేపట్టిన పాదయాత్ర అభినందనీయమన్నారు. ఎండ, వానను లెక్కచేయకుండా దేశం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వేల కిలోమీటర్లు నడుస్తున్న ఆయన సంకల్పం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.




**ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయమే లక్ష్యం:**

న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని సంజీవ్ ముదిరాజ్ అన్నారు. సామాన్య ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటున్న నాయకుడిగా రాహుల్ గాంధీ ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించారని తెలిపారు.'రాగా ఫర్ ఇండియా " పాదయాత్ర కేవలం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే ఆకాంక్ష మాత్రమే కాదని, ఐక్యమైన, సమ్మిళితమైన, న్యాయబద్ధమైన, బలమైన, ప్రగతిశీల భారతదేశ నిర్మాణం కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

**యువత ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి:**

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని సంజీవ్ ముదిరాజ్ అన్నారు. యువత రాజకీయాలకు దూరంగా ఉండకుండా ప్రజాస్వామ్య పరిరక్షణలో చురుకైన భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రగతిశీల ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని కోరారు.

**పాలమూరులో కాంగ్రెస్ శ్రేణుల సంఘీభావం:**

'రాగా ఫర్ ఇండియా ' పాదయాత్ర పాలమూరు గడ్డపైకి రావడం గర్వకారణమని సంజీవ్ ముదిరాజ్ అన్నారు. వెంకటేశ్వర్లు వేసే ప్రతి అడుగు ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం వేసే అడుగేనని పేర్కొన్నారు. యాత్ర విజయవంతంగా కొనసాగాలని, దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు లభించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, మినాజుద్దీన్, టీపీసీసీ అధికార ప్రతినిధి జాహీర్ అక్తర్, కార్పొరేటర్లు ఎంపీ ప్రవీణ్ కుమార్, అవేజ్, తాహెర్, ప్రశాంత్, మేఘ్య నాయక్, జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ పసుల రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, హన్వాడ మండల అధ్యక్షుడు మహేందర్‌తో పాటు ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాల విద్యార్థులకు అండగా అలింకో క్యాంప్

## అవసరాలను గుర్తించి సహాయక పరికరాల అందజేతకు చర్యలు..

## తల్లిదండ్రులు, ఐ ఈ ఆర్ పి లు సేవలను సద్వినియోగం చేసుకోవాలి:

## డీఈఓ విజయకుమారి

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అవసరమైన సహాయక పరికరాలు, సేవలను అందించేందుకు మహబూబ్‌నగర్ జిల్లాలో అలింకో అసెస్మెంట్ క్యాంప్ సోమవారం ప్రారంభమైంది. జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి క్యాంప్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి తగిన సహాయం అందించడమే క్యాంప్ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ, అలింకో సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



**అవసరాలకు అనుగుణంగా సహాయక పరికరాలు:**

క్యాంప్‌లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వైకల్య పరిస్థితి, అవసరాలను అంచనా వేసి, వారికి అవసరమైన సహాయక పరికరాలు మరియు ఇతర సేవలను అందించేందుకు చర్యలు చేపట్టారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన సహకారం అందించడంపై అధికారులు దృష్టి సారించారు.

**తల్లిదండ్రులకు, ఐ ఈ ఆర్ పి లకు సూచనలు**

విద్యార్థులకు అందుబాటులో ఉన్న సంక్షేమ, విద్యా సేవలను సకాలంలో పొందేందుకు తల్లిదండ్రులు, ఐ ఈ ఆర్ పి లు చొరవ చూపాలని డీఈఓ విజయకుమారి సూచించారు. ప్రతి ప్రత్యేక అవసరాల విద్యార్థికి అవసరమైన సహాయం అందేలా జిల్లా విద్యాశాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంవో సుధాకర్ రెడ్డి, లక్ష్మణ్ సింగ్, సంబంధిత ఐ ఈ ఆర్ పి లు, ప్రత్యేక ఉపాధ్యాయులు, అలింకో అసెస్మెంట్ బృందం తదితరులు పాల్గొన్నారు.